# ప్రమీల

ప్రమీల చచ్చిపోయింది !

పాపం! పసుపు బట్టల పసుపైనా ఆరలేదు. పాదాలకు పెట్టిన పారాణి ఎరుపు వెక్కిరిస్తూనే వుంది. నుదుట తీర్చిన కళ్యాణ తిలకం నవ్వుతూనే వుంది.

ఏవో? పసరు కోర్కెలు కొంటెగా వొంటరితనాన్నీ, స్వేచ్ఛనూ కోరుతాయి. పైగా పరువం, కలిమి జంటగా జతపడితే కొత్త మురిపెం సరికొత్త అనుభవాన్ని ఆశిస్తుంది. ఈ కారణంగానే సీతాపతి రాజు శృంగారయాత్ర తలపెట్టాడు. 'ఏ(థిల్లూ లేకుండ ఇంటి గదిలో పూజార్ల మంత్రాలతో, అమ్మలక్కల సందడిలో ఏం? మొదటి రాత్రి? మేం హాయిగా హనీమూన్ వెళ్లుతాం!' అంటూ అల్లుడుగారు పట్టుబట్టి అజంతా ఎల్లోరా శృంగార యాత్రకు బయలుదేరాడు భార్య ప్రమీలతో కూడ. పెళ్లైవారం తిరగలేదు, ఇరుకుటుంబాలకు పెళ్లి తరువాత జరిగే ఏ మూద్దూ ముచ్చట తీరలేదు. అయినా! సంతోషంగా సాగనంపారు.

'మోక్షానికంటూ పోతే మొసలెత్తుపాయె నని' నవ్వుతూ తుళ్లుతూ సిగ్గులొలుకుతూ వెళ్లిన ప్రమీల మూడోనాటికి శవమై యిల్లు చేరింది.

హనీమూనంటూ అపరిచితుడైన వ్యక్తితో మూడు ముళ్ల ప్రభావంతో సంపూర్ణ విశ్వాసంతో అందరు కొత్త పెళ్లికూతుళ్లలా నే వెళ్లింది ప్రమీల. వయసు చేసే గారడి అది. సంప్రదాయం నేర్పిన కట్టుబాటు అది. ఒక్క క్షణం, తననూ, తన సర్వస్వాన్ని మరిపించే తన్మయ స్థితిలో ఏదైనా జరుగవచ్చు. కానీ ప్రేమబంధం అలా జరుగనివ్వదు. ఎక్కడో ప్రకృతి వికటించినప్పుడు తప్ప.

హనీమూన్ యాత్రకు వెళ్లిన ప్రమీలకు రాత్రి పడకగదిలో విపరీతంగా కడుపు నొప్పి వచ్చింది.

కొత్త పెళ్లికూతురు భయపడుతుంది, డబ్బుపోతే పోయిందని టాక్సీ కట్టించుకుని అర్థాంతరంగా హోటల్ గది ఖాళీ చేసి భార్యను తీసుకుని బయలుదేరాడు సీతాపతి రాజు. వెళ్లిపోతున్న జంటను చూసి 'అయ్యో! పాపం!' అన్నారు అందరు.

ఇల్లు చేరి డాక్టరు వచ్చి రాక ముందే గుడ్లు తేలేసింది ప్రమీల. రెండు వైపులా నోటినుండి ఎర్రటి రక్తం కారింది. డాక్టరు మూతి విరిచి ఏ పరీక్షా జరుపకుండానే వెళ్లిపోయాడు. అందరు బావురుమన్నారు.

తల్లీ తండ్రి నెత్తీనోరు కొట్టుకుంటున్నారు. అల్లాడుతున్నారు, అలమటిస్తున్నారు. అయినా అల్లుడి బాధముందు వారి బాధ వో లెక్కలోనిది కాలేదు. సీతాపతి తల్లిదండ్రు లొచ్చారు. ప్రమీల శరీరానికి గంధపు చెక్కలతో దహనసంస్కారం జరిగింది.

పాపం! సీతాపతి కంటికీ మంటికి ఏకధారగా కన్నీరు వర్షిస్తున్నాడు. జుట్టు పీక్కుంటున్నాడు, అంగీ చించుకుంటున్నాడు, డబ్బాలకు డబ్బాలు సిగరెట్లు కాలుస్తూ పొగగొట్టంలా ముక్కు రంధ్రాలనుండి పొగలు చిమ్ముతున్నాడు. తిండి మాట ఎత్తగానే 'పమ్మీ! అంటూ ప్రలాపంలో పడిపోతున్నాడు. అల్లుడిగారి దుఃఖాన్ని చూసి అమ్మాయి తల్లి భాగ్యమ్మ తన దుఃఖాన్ని దిగమింగుతూ 'అయ్యయ్యో! వోర్వలేని మాయదైవం ఎంతపని చేసే? ప్రేమ పక్షుల్లాంటి ఈ జంటను విడదీయటానికి ఎలా మనుసొప్పిందో? ఆ రాతిగుండె మృత్యువుకు ఈ పిల్లవాడి దైన్యం చూడలేకపోతున్నాను' అంటూ వియ్యపురాలిని చూచి 'వొదినెగారూ! మీరైనా అబ్బాయికి కాస్త ధైర్యం చెప్పండి! ఏదో కొంచెం ఎంగిలిపడమనండి' అంటూ గద్గద స్వరంతో బ్రతిమాలింది.

అందరూ కళ్లొత్తుకుంటూ, ముక్కులు చీదుకుంటూ జనన మరణాల రహస్యాన్ని చాలా నిర్లిప్తంగా వివరిస్తూ -

'నాయనా! ప్రమీల ఎక్కడికీ పోలేదు, నీ మనస్సులోనే వుంటుంది. కానీ, నీవు ఇలా కన్నీరు కారుస్తూ యాతన పడ్తూ వుంటే ఆ జీవి నిన్ను వదలలేక, తాను చేరవలసిన తావు చేరలేక నీడలా తిరుగుతూ వుంటుంది. బాబూ! నీవు నిగ్రహించుకుని ఆ ఆత్మకు ముక్తి కల్పించు' అన్నారు.

అయిదురోజుల తరువాత ఏరిన అస్తికలను భద్రంగా మూట కట్టుకుని 'నా భార్య పెద్దకర్మ మా ఇంట్లోనే జరగాలి' అన్నాడు.

అందరూ 'నీ భార్య నీ యిష్టం' అన్నారు. తన వూరు బయలుదేరి వెళ్లాడు సీతాపతిరాజు తన పరివారంతో పాటు.

సీతాపతిరాజుకు ఆస్తిపాస్తులకు వెలితి లేదు. మంచి రూపసి, అంటే వ్యక్తి ఎదుటివాడి చూపుకు నజరు ఆనేవాడే! ఐదడుగుల ఎనిమిది అంగుళాల ఎత్తుతో, చామన చాయలో నిగనిగలాడుతూ వుంటాడు. దానికి తోడు నల్లని మీసం కట్టూ మొగవాడికి చిహ్నంగా వుంటుంది. నడకతీరులో, మాట విధానంలో ఏ పొరపొచ్చెమూ కనిపించదు. కళ్లల్లో మాత్రం యౌవనపు చిలిపి మెరుపులు తారాడుతూ కనిపించవు. నవ్వినప్పుడు మాత్రం ఆ నవ్వులో తెచ్చికోలుతనం, ఏదో వికటత్వం దోబూచులాడుతూ తొంగి చూస్తుంది.

బహుశః అది మాడరన్ హయ్యర్ క్లాసు హిపోక్రాటిక్ వే ఆఫ్ లైఫ్ స్టైల్‌కు చిహ్నంగా చెలామణీ కావచ్చు.

ఇన్ని సుగుణాలల్లో పరిశీలనగా చూస్తే తప్ప లొచ్చుగా కనిపించని ఈ నవ్వు అసలు లెక్కలోనికే రాదు. పైగా అది గొప్ప ఇంటి బిడ్డ హుందాతనానికి ప్రతీకగా గుర్తింపబడింది.

శ్రీనివాసబాబు ప్రమీలకు మేనత్త కొడుకు, బి.యస్‌సి. చదివేప్పుడు సీతాపతి రాజుకు క్లాసుమేటు, రూంమేటు కూడా!

శ్రీనివాస్ కరకుపూర్‌లో బి.యి. ఎగ్జామ్స్ రాస్తూ ప్రమీలపెళ్లికి రాలేకపోయాడు, 'పెళ్లికానుక తీసుకుని వెళ్లుతాను' అనుకుంటూ వుండగానే ప్రమీలపోయిందనీ ఆమె పెద్దకర్మ వగైరాలు ఆమె సదరు అత్త వారింటిలోనే జరుగుతున్నాయనీ తెలిసింది.

'పాపం! ఈ స్థితిలోనన్నా సరే ఎంతో మంచివాడంటూ వింటున్న భగ్నహృదయుడు ఆమె భర్తకు కండోలెన్స్‌లు చెప్పి, ప్రమీల ఆత్మకు శాంతి కూరుస్తాను' అంటూ శ్రీనివాసు పెద్దకర్మనాడు సీతాపతిరాజు వూరు పెదపాలెం వెళ్లాడు. వెళ్లగానే సీతాపతిరాజే ప్రమీల భర్త అంటూ తెలుసుకున్న శ్రీనివాసు నిర్ఘాంతపోయాడు. తన కాళ్లకింద భూమి కదులుతున్నట్లు అనిపించింది. జరుగకూడని విషయం జరిగిపోయినట్లూ, ప్రమీలను చూపుడు గుర్రంలాంటి సీతాపతికి ఇచ్చి పెద్దవారు పొరపాటు చేసినట్లు భావించాడు.

అప్పుడు సీతాపతికి సంబంధించిన విషయం యావత్తు టి.వి.లో చూస్తున్న దృశ్యాల్లా ఒకదాని వెంట వొకటి కదలడం ప్రారంభించాయి.

సీతాపతిని రూంమేట్సు అంతా 'సీతా' అంటూ కట్‌షార్టు చేసి పిలిచేవారు. మొదట్లో ఆ పిలుపుకు వంకర్లు తిరిగేవాడు, తరువాత తరువాత సర్దుకున్నాడులే! మొదటి రోజుల్లో పుస్తకాల్లో ఏవో బొమ్మలు దాచుకుని చూస్తుండేవాడు.

బి.యస్‌సి. సెకండ్ ఇయర్‌కు వచ్చేసరికి పుస్తకాల్లో వున్న బొమ్మలన్ని గోడలపైకి వచ్చేశాయి. (నేను వేరే రూంకు మారడంతో తన కొక్కడికే ఆ గదిని కేటియించే సదుపాయాన్ని కల్పించుకున్నాడు.)

అప్పుడు రూంనిండా ఆడవాళ్ల బొమ్మలే అతికించుకునేవాడు. దాదాపు స్త్రీల చిత్రాలన్నీ అర్ధనగ్నరూపాలె! ఎరోటిక్ చిత్రాలంటే ఎక్కువ యింటరెస్ట్‌తో చూచేవాడు. అయితే వాడి యీ లౌల్యాన్ని మరో విధంగా భావించకుండా మా కర్మకాలి, వాడి జాతకం బాగుండి వాడికి సహజంగానే కళాభిరుచి వుంది. అనే నమ్మకాన్ని మాలో చాలా మందికి కలిగించాడు.

కళాభిమానం వల్లనే వాడు చైనీస్, జపనీస్ పెయింటిగ్స్ నుండి మాడరన్ మాస్టర్స్ రిప్రొడక్షన్స్ అన్నీ ఎంతో వెలపెట్టికొనేవాడు. ఈ సేకరణలో కంచులో పోతపోసిన

మూడడుగుల ఎత్తు స్త్రీ మూర్తుల విగ్రహాలుండేవి. ఒక్కొక్కప్పుడు వాటితో పిచ్చిగా ఆడుకునేవాడు.

వాడి ఈ చేష్టలు ఎవ్వరికీ అంత చెడ్డగా తోచలేదు. దీనికి తోడు పాత నాణేలు, పాత కార్డుల సేకరణ కూడా చేసేవాడు. ప్రసిద్ధులైన రాజకీయ నాయకులు ప్రపంచ నాయకులతో కలిసిన అపురూపమైన సన్నివేశపు ఫోటోలు సంపాదించి వాటి జిరాక్స్ కాపీలు కూడా భద్రపరుచుకునేవాడు. ఇవన్నీ చూచి ఏదో వీడికి కళపై పిచ్చి అభిమానం! డబ్బుంది, రుచీ వుంది, కొనే స్తోమతా వుంది అనుకునేవాళ్లం.

మరీ దగ్గరి స్నేహితులు ' ఇలాంటి సుందరిని తప్ప వివాహమాడవు కాబోలు' అనీ 'వొరే! ఇవి అభిమంత్రించిన స్త్రీలు కాదు కదా?' అంటూ ఆట పట్టించేవారు. నగ్నస్త్రీ రూపంలో వున్న బొమ్మల సౌరు మెచ్చే సీతకు అచ్చంగా ఆడపిల్లలంటే బెదురు. తాకుతారో? తగుల్తారో? అన్నంత దూరంలో వుండేవాడు. వీడి ఈ తీరు మాత్రం కొంత విడ్డూరంగా కనిపించేది చాలామంది దగ్గరి స్నేహితులకు కూడా.

వాడు 'డెంటల్ సర్జన్' అయ్యాడు. నేను ఇంజనీరింగ్ చేశాను. వోనాడు నా స్నేహితుడు రాఘవ సైక్యాట్రిస్ట్‌తో వాడిని చూద్దామంటూ వాడి గదికి వెళ్లాం. గదినిండా వో అంగుళం తావు లేకుండా బొమ్మలు అతికించుకున్నాడు.

వాడి వ్యవహారం నాకు బాగా తెలుసు కాబట్టి నేనేదీ అంతగా పట్టించుకోలేదు. రాఘవ మాత్రం ముఖం చిట్లించుకున్నాడు. ఏదో అసభ్యమైన వాతావరణంలో తాను అడుగుపెట్టినట్లు ఫీలయ్యాడు. కానీ, నేను మామూలుగానే ఆయా విషయాలను గూర్చి మా పాత రూం మేట్సు గూర్చి అడిగాను, వాడేదో సమాధానం యిచ్చాడు. వెళ్తాం అంటూన్నా వినకుండా బలవంతంగా కాఫీ చేసి యిచ్చాడు. వ్యక్తిలో స్థిరత్వం లేదు, ఏదో తొందరపాటు కనిపించింది. అది వాడికి సహజ లక్షణం!

చివరకు మేం లేవబోతూ 'పప్పన్నం ఎప్పుడు పెడ్తావురా?' అన్నాను. దాంతో వాడు చెమటలు తుడ్చుకుంటూ, నాకు నచ్చిన పిల్ల దొరకొద్దూ? అమ్మాయి ఒకటే కాదు, ఆమె ఫామిలీ, తోటి అల్లుళ్లూ అంత నాకు నచ్చాలిగా?' అన్నాడు పెద్దగా నవ్వుతూ

'అలా చూస్తూ కూర్చుంటే ముసలాడివౌతావురా! ఎనీవే బెస్ట్ ఆఫ్ లక్' అంటూ వచ్చేశాం. మేం వస్తూ వుంటే ఏదో వికృతరూపం వాడి రూంలోకి వెళ్లడం చూశాం.

కడప దాటగానే రాఘవ నన్ను చూస్తూ ' ఈ సీతగాడి చరిత్ర ఏంటి? అన్నాడు. ఏముందీ? ఏమీలేదు, అమాయకుడు పాపం, డబ్బు విషయంలో చాలా నిక్కచ్చిగా వుంటాడు. ఆడపిల్లల వొంపులూ వొయ్యారాలు చూచి వోడిపోయినట్లు కనిపిస్తాడు. కాని, నిజంగా బ్రహ్మచర్యాన్ని పాటిస్తున్నాడు' అన్నాను.

నా మాటలు విన్న రాఘవ పెదవి విరిచి అది కాదు అసలు విషయం. వ్యక్తిగా వాడు మంచివాడే కావచ్చు. కానీ వాడికి పురుషత్వ ధర్మలోపం వుంది; అయితే పూర్తిగా

షండుడూ కాదు. తనకు శక్తి చాలక అభాస పాలౌతానేమో? అన్న ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుతో అప్పుడప్పుడు, తీవ్రమైన డిప్రెషన్‌కు లోనౌతూ వుంటారు ఇలాంటి వారు. వ్యక్తి సహజమైన కోరికలను వికృతంగా, పాశవికంగా తీర్చుకుంటూ వుంటారు. ఇలాంటి వాళ్లు పెళ్లి చేసుకోకపోవడం మంచిది. అయినా గొప్పింటి బిడ్డలు, అహంకారం కోసం, ప్రతిష్ఠ కోసం పెళ్లాడితే ఆడవచ్చు. కానీ సంభాళించడం మాత్రం కష్టం' అన్నాడు.

'అయ్యో! పాపం! సీతాపతి చివరకు ఏమైపోతాడో? అంటూ నా ఎద వాడివైపు మెత్తబడి కరుణతో మూల్గింది. ఈ గత దృశ్యాలన్నీ శ్రీనివాసు మనసులో మెదులుతున్నా, వాడిని చూచి ఏమీ అనలేకపోయాడు.

శ్రీనివాసబాబును చూచిన సీతాపతి 'శ్రీనూ! ఎంతపనైంది? పమ్మీని నీవు చూడలేదు, ఆమె నా డ్రీమ్‌గర్ల్, అలాంటిది ఏ కోరికా తీరకుండానే నన్నీ దుఃఖ సముద్రంలో ముంచి వెళ్లిపోయింది' అంటూ మీదపడి బావురుమన్నాడు.

'ప్రమీల నా మేన కోడలు! నీవు అన్నట్లే ఆమె చాలా అందమైన అమ్మాయి'. అంటూ తన భుజంపై పెట్టిన వాడి తలను మెల్లిగా తోసేస్తూ ఏవగింపుతో చెప్పాడు. అదే రాత్రి బయలు దేరి వెళ్లిపోయాడు.

శ్రీనివాసు మనస్సు అనేక విధాలుగా పయనించసాగింది. ఈ ఆలోచనా నేపథ్యంలో రాఘవ తన మనసులో మెదిలాడు. వెంటనే హైదరాబాదు వెళ్లి రాఘవను కలుసుకున్నాడు.

'రాఘవ! సీతాపతి పెళ్లి చేసుకున్నాడు' అంటూ పొడి అక్షరాల్లో చెప్పాడు.

'శుభం! ఎవరా అమ్మాయి? స్లొటైడ్, మ్యాల్టెడ్, టోస్టెడ్, టేస్టెడ్ రకమేనా? కాక మంచి సంప్రదాయం, ఆస్తిపాస్తులున్న కుటుంబమా?

'అమ్మాయి నా మేన కోడలు'

'డ్యామిట్! నిన్ను హెచ్చరించానుగా? ఎందుకలా జరుగనిచ్చావ్? అమ్మాయి అదృష్టంతో వాడు వీర్యవంతుడైతే తప్ప, ఆ పిల్ల బ్రతుకు? నీవు పెళ్లికి వెళ్లావా? రెండు వైపులా కావలసిన వారేగదా నీకు.

'లేదు చావుకు వెళ్లాను'

'అంటే సీత ఆత్మహత్య చేసుకున్నాడా'

'కాదు! ప్రమీల చచ్చిపోయింది'

'మైగాడ్! ఎలా ? జబ్బేమిటి?

'పెళ్లైన మూడోనాడే హనీమూనంటూ అజంతా తీసుకెళ్లాడు సీత, ఆ మరునాడు

రాత్రే ప్రమీలకు కడుపునొప్పి తీవ్రంగా వచ్చింది. ఆ రాత్రే ప్రమీలను తీసుకుని రూం ఖాళీ చేసి ట్యాక్సీ చేసుకుని ఇంటికి వచ్చేశాడు.

'మెడికల్ రిపోర్టు ఏమన్నది?'.

'డాక్టరు వచ్చేవరకే ప్రమీల చచ్చిపోయింది. వెంటనే చికిత్స జర్గాల్సింది. అమ్మాయి బంగారు బొమ్మలా వుంది; పాపం సీతాపతి బాబు! అంటూ రెండు సానుభూతి వాక్యాలు పలికి ఫీజు తీసుకుని వెళ్లిపోయాడు' అంటూ మరోక్షణానికి

'వాట్ ఈజ్ యువర్ అనాలిసిస్ రాఘవ?' అంటూ ప్రశ్నార్థకంగా చూశాడు శ్రీనివాస్.

'శ్రీ ! ఇది నాచురల్ డెత్ కాదు, ఆ అమ్మాయి చంపబడ్డది'

'కాదురా! మరీ అంత కిరాతకంగా శృంగారయాత్రలో భార్యనే చంపుతాడా? సౌందర్యారాధకుడు కదా? మరి ప్రమీల చావుకు కారణం'

'శ్రీ! నేను మొదటే చెప్పాను, ఇలాంటివారు వక్రమార్గంలో ప్రవర్తిస్తారు. స్త్రీని పాశవికంగా హింసిస్తూ తృప్తిని పొందుతారు. ఇంకా...'

'అలా శాడిస్టుగా ప్రవర్తిస్తూ అమ్మాయిని శారీరకంగా బాధించిన గుర్తులేవీ కనిపించలేదు'

'శ్రీ! నేను చెప్పేది పూర్తిగా విను! సీతాపతి ఎప్పుడూ నగ్నస్త్రీ మూర్తులను చూస్తూ వాటితో ఆడుకుంటూ వుండే వాడని చెప్పావుకదా!'

'అవును, అది కళారాధన, సౌందర్యపిపాస, వొంటరితనం వల్ల అయివుండవచ్చు అని కూడా చెప్పాను కదా? వాడి మనసులో వున్న కోరికకు దీటుగా మా ప్రమీల దొరికినప్పుడు ఆనందిస్తాడు, కేళీలోలుడై రమిస్తాడు కదా రాఘవ ?

'అక్కడే పొరబడ్డున్నావ్ శ్రీను, ప్రమీల ఇంతవరకు పురుష సంపర్కం తెలియని యువతి, ఉత్తమ సంస్కారంలో పెరిగి పెద్దైన పిల్ల, అంతే గాని ప్రకృతికి విరుద్ధమైన వికారాలూ, విపరీతాలు తెలియనిది, అందుకే ఆ పనికి మాలిన థర్డ్‌రేట్ ఫెలో చేయ తలపెట్టిన వికృతాలకు ఏవగించుకుని సహకరించకపోవచ్చు, దానితో రెచ్చిపోయిన ఆ శాడిస్టు ఆమెను పాశవికంగా హింసించడానికి పూనుకొని వుండవచ్చు, తన ప్రయత్నానికి ముందుగా అమ్మాయిని మైమరపించే ఏదో మందు టీలోనో జ్యూస్‌లోనో కలిపి వుంటాడు. అప్పుడు నగ్నమూర్తిని చేసి వికృత విధానంలో అనుభవించివుంటాడు. ఇవన్నీ వికటించి నిజంగానే కడుపులో నొప్పి మొదలైంది. అది తెలిసే తొందరపడి వాడు ఇంటికి పరుగెత్తుకొచ్చాడు.

'రాఘవా! వాడిని కోర్టుకు ఈడ్చి కఠినశిక్ష పడేట్లు చూడ్డ

'శ్రీను! ఎందుకు? లేనిపోని రభస. ప్రమీల తల్లితండ్రికి తెలిస్తే గుండె పగిలి చస్తారు. వీడు చేసిన దుర్మార్గానికీ దౌష్ట్యానికీ సంబంధించి ఏ ఆధారమూ, ఆచూకీ లేదు? అనుమాన పడవలసిన పరిస్థితీ కాదు. కాబట్టి వచ్చిన డాక్టరు అయ్యోపాపం అంటూ సానుభూతి కనబరిచాడేకాని ఏదోషాన్ని శంకించలేదు, పేరు ప్రతిష్ఠలున్న వున్నత కుటుంబాలు నవవధూవరులు, అమ్మాయి తల్లీతండ్రి దగ్గరే వున్నారు. అత్తమామలూ తదితర బంధువర్గం అంతా వచ్చారు. అన్నీ సజావుగా జరిగిపోయాయి.

ఇక శంకకూ సందేహాలకూ తావెక్కడ?

ఈ సారి వాడు మళ్లా పెళ్లికొడు కౌతాడు. ఈ పెళ్లేదో మనం చేద్దాం. వోపిక పట్టు, రెడ్ హాండెడ్‌గా పట్టుకుందాం, లేకపోతే సంఘంలో అనర్థాలు తలెత్తుతాయి అంటూ సమాధాన పరిచాడు.

తల్లితండ్రులకు ఎద బరువులుగా వున్న ఆడపిల్లలకు అయిన సంబంధం అనగానే సర్వస్వం తాకట్టు పెట్టి పెళ్లి చేయడానికి సిద్ధపడ్డారు. పైగా సీతాపతి సంబంధం నూటిలో ఒక్కటి కదా! మరి? సంవత్సరం తిరక్కుండానే మా పిల్ల అంటే, మా పిల్ల అని పెళ్లి సంబంధాలు పోటాపోటీగా రావడం ప్రారంభం అయ్యాయి.

సీతాపతి మెదడులో ఎన్నెన్నో కొత్తప్లాన్లు తిరగాడసాగాయి, లోలోపల ఆడవాసన కోసం ఆరాటపడ్తూనే అతి తెలివిగా లోకభీతికోసం ' ఆ ' ఇప్పుడేం తొందర, ప్రమీలను మర్చిపోలేకపోతున్నాను' అన్నాడు.

చివరకు వో సంబంధం నిశ్చయమైంది. ఈ సంబంధం శ్రీనివాసు వైపునుండి వచ్చింది. అమ్మాయి రాఘవకు దగ్గరి బంధువు. తల్లి తండ్రి లేరు, అమ్మాయి పేర బ్యాంకులో వున్న డబ్బు అయిదు లకారాలు దాటేవుంటుంది. పెళ్లి, శోభనం, అన్నీ వో వారంలో జరిగిపోవాలి.

అమెరికా వెళ్లే ముందు పిల్లకు వేలు విడిచిన మేనమామ అన్ని సంబరాలు తన యాజమాన్యంలో జరగాలి అంటున్నాడు. కాబట్టి పెళ్లి వారంలో జరగాలి అన్నాడు శ్రీ.

అమ్మాయి ఏపుగా ఎదిగి వుంది. కన్నూ ముక్కుపోవడి ఆకర్షకంగా వున్నాయి. చేతికి అందిన పిల్ల! కాదనడం ఎందుకంటూ అందరూ ఓ.కే. చేశారు. పెళ్లి నిశ్చయమైంది. పొంగే ఆనందాన్ని సీత అణచుకోలేక సినిమాలో సుందరాంగిని చూచి సోఫాలు కొరికే మూర్ఖుడైన పామరుడిలా పక్కకు తిరిగి తన చేతిని తానే కొరుక్కున్నాడు.

రాఘవ ఇదంతా పరిశీలనగా పరిశీలించాడు; అపరాధి తనకు తానై బోనులో చిక్కబోతున్నాడని నిర్ధారీకరించుకున్నాడు.

పెళ్లి చాలా సింపుల్‌గా జరిగింది. ఆ మరుసటి రోజే ఆలూ మగలను ఏకం చేసే కార్యక్రమం కోసం ఆత్రపడుతున్నారు ఆడవారు 'ఈ హంగామాలేవీ వద్దు, పూర్వస్మృతులు నన్ను బాధిస్తాయి. మేమేం పసిపిల్లలమా?' అన్నాడు సీతాపతి.

'బావా! ఈ సారి నీవు తప్పించుకోవటానికి వీలులేదు, పెద్దవాళ్లకూ సరదాలంటూ వుంటాయి; పైగా ఘనంగా జరుపుకునే వేడుక ఇదొక్కటే! ఇక ముందు ముందు, కట్నాలూ కానుకలూ, సూడిదలంటూ తెచ్చి సీమంతం, బారసాల అంటూ ముద్దూ ముచ్చటలు తీర్చేవారు అమ్మాయికి ఇక్కడ ఎవ్వరూ లేరు, ఏ వేడుకైనా ఈ నాల్లు రోజులేగా? వద్దనకండి అన్నాడు రాఘవ.

అవును సీతా! పాత స్మృతులు మరిచిపో, పాపం విధివంచితుడవు, స్త్రీల లాంఛనాలు తీర్చుకున్న తరువాత నీకు ఏకాంతంగా నీవు నచ్చే విధంగా అలంకరించిన బంగళా ఏర్పాటు చేస్తాం సరేనా? అన్నాడు శ్రీనివాసబాబు. అంగీకరించాడు సీతాపతిరాజు.

పెళ్లికూతురు లతా, సీతాపతిరాజు ఇద్దరూ మంగళవాద్యాలు మ్రోగంగా, ఆడవారి హారతుల వెనక పెద్దవారి దీవెనలతో వరస కలిసిన వారి నవ్వుల జల్లుల్లో తడుస్తూ కారెక్కి బంగళాకు వెళ్లారు.

బంగళా వెనకా ముందు చక్కని పూల తోట వుంది. వెనకవైపు చిన్న స్విమ్మింగ్‌పూల్ కూడా వుంది. ఈ స్విమ్మింగ్ పూల్‌లో డైవ్ చేయడానికి వీలుగా పై అంతస్తులో వున్న ఒకే ఒక బెడ్‌రూంలోంచి మెట్లు కూడా వున్నాయి. పై చెక్కమెట్టు బలంగా లేదు ఎందుకో?

ఆ స్విమ్మింగ్‌పూల్ చూడగానే సీత మెదడు కొత్త ప్రణాళికను రూపొందించుకుంది.

లత సామానంత సర్దుకుని బట్టలు మార్చుకునే యత్నంలో వుంది. బయటి నుంచి 'లతా' అంటూ సీతాపతి హుషారుగా పిలిచాడు. పిలిచారా? అంటూ లత చీరకొంగు నిండుగా సర్దుకుని బ్లౌజ్‌లేని జాడ కనిపించకుండా జాగ్రత్త పడుతూ ఇవతలికి వచ్చింది.

లతను ఎగాదిగా చూస్తూ 'లతా! ప్లీస్ స్విం చేద్దామా?' అన్నాడు.

'నాకు స్విమ్మింగ్ రాదండి, మొదటి సారి చెవుల్లో నీళ్లు వెళ్లి సఫోకేటు అయ్యాను అందుకే నేర్చుకోలేదు, రాదు' అంటూ వొయ్యారాలు వొలకబోసింది.

ఈ మాట ఎందుకో సీతకు ఆనందాన్ని యినుమడింపచేసింది.

ఆ యింట్లో అన్ని సౌకర్యాలు అంటే పాలు, పళ్లూ, ఫలహారాలు, వేడినీళ్లు, ఫ్రిడ్జ్, టీ, కాఫీ, చక్కెర కావలసిన ప్లేట్లూ, కప్పులు, గ్యాస్ స్టౌ అన్నీ వున్నాయి.

లత ఇంతింత సిగ్గు విడిచి భర్తతో మాట్లాడుతూ వుంది. ఇద్దరు కలిసి ఫలహారం తిన్నారు.

ఈ రాత్రికి లైటుగా వుంటేనే మంచిది. టీ తాగుదాం, నాకు 'టి' చేయడం చేతనౌతుంది. చేస్తాను' అన్నాడు.

'మీరెంత మంచి వారండి' అంటూ మెచ్చుకుంది లత.

తన ప్లాను ప్రకారం 'టి' చేసి తెచ్చాడు సీత, ఒక కప్పు లతకు అందించి తాను వో కప్పు పట్టుకున్నాడు.

'టి'ని సిప్ చేసినట్లు నటించి, 'టీ లీఫ్ ఎక్కువైంది. షుగర్ కల్పుకు వస్తాను' అంటూ లోపలికి వెళ్లి ఆ 'టి' పారబోసి తానంతకు మునుపే సిద్ధం చేసుకున్న 'టీ' ని కప్పులో పోసుకుని వచ్చేసింది లత.

ఇద్దరూ నవ్వుతూ సిగ్గారి చూపులు విసురుతూ 'టి' తాగుతున్న కొద్దీ లత కళ్లు మూసుకుపోతున్నాయి, చివరి గుటక తాగి దభీల్ మంటూ టేబుల్‌పైన వాలిపోయింది. ఆమెను త్వరత్వరగా నగ్నమూర్తిని చేశాడు. బెడ్‌రూంలోకి తీసుకువెళ్లి, ఆమెతో పాశవికంగా ప్రవర్తిస్తూ తనకు అలవాటైన విధానంలో హింసించడం మొదలు పెట్టాడు.

ఆ వైపరీత్యాలను తట్టుకోలేని లత తనకు మెల్లమెల్లగా స్పృహ వస్తున్నట్లు మూల్గడం ప్రారంభించింది. అబ్బా! నా తల భారంగా వుంది కడుపులో ఏదో వికారంగా వుంది అంటూ లేచి కూర్చుంది.

అలా లేచిన లతను చూస్తూ ' ఏమీ లేదు డార్లింగ్, మొదటి సారి కాబట్టి నీకు అలానే వుంటుంది. నీవే అలవాటు పడ్తావ్ వోర్చుకో' అంటూ సమీపించాడు సీత.

'ఛీ' నీచుడా! దుర్మార్గుడ, నపుంసకుడ అవతలికి నడువ్' అంటూ గర్జించింది లత.

ఆ మాటతో ఒక్క తృటి అవాక్కై ఏదో మోసం జరిగినట్లు పసిగడ్తూ సీతాపతి రాజు 'చూడు! బిగ్గరగా అరిచావో? ఎవరితోనైనా చెప్పావో? అంటుండగానే లత వెటకారంగా నవ్వుతూ 'ఏం జేస్తావేం?' అంటూ ప్రశ్నించింది. దాంతో రెచ్చిపోయి సీతాపతి రాజు ముఖ కవళికలు వికృతంగా మార్చి -

'ఏం చేస్తానా! ఆ స్విమ్మింగ్ పూల్‌లో పడేస్తాను, కాలుజారింది అంటూ నేనే పెద్దగా అరిచి రక్షించండి అంటూ అల్లరి చేస్తాను. అది విని అర ఫర్లాంగ్ దూరంలో వున్న వాచ్‌మన్ వచ్చేవరకు నీవు మూడో మునుగు మునుగుతుంటావ్ తెలుసా' అన్నాడు.

'అయ్యో! నా ప్రాణాలు తియ్యకండి మీకు పుణ్యం వుంటుంది' అంటూ 'అన్నయ్యా! అన్నయ్యా!' అంటూ బిగ్గరగా అరిచింది.

నిజానికి లత ఎవరో కాదు, ప్రైవేటు డిటెక్టివ్ ఎంగేజ్ చేసిన అమ్మాయి, చాల

చురుకైంది, కరాటే, షూటింగ్, స్విమ్మింగులలో ఆరితేరింది. అవసరం కొద్ది 'కాల్‌గర్ల్' గా కూడా పనికి వస్తుంది. నటనలో మహా ఘటికురాలు. మొదటే అన్ని విషయాలు బాగా బ్రీఫ్ చేశారు కాబట్టి సర్వసన్నద్ధంగా టేప్‌రికార్డర్‌తో సహా వచ్చింది. నిజానికి ఆ అమ్మాయి మత్తు మందు కలిపిన 'టీ' తాగలేదు, చక్కెర కలుపుకునే నెపంతో లోపలికి వెళ్లి అంతవరకే సిద్ధంగా వుంచుకున్న 'టీ' ని తెచ్చుకుని ఆ 'టీ'ని పారబోసి వచ్చింది. కథ నడిపింది. నాటకాన్ని రక్తి కట్టించింది.

లత అరుపులు విని మెట్ల కిందే కావలి కాస్తున్న శ్రీనివాస్, రాఘవ ఇద్దరూ కిందివైపు గొళ్లెం పెట్టి గబాగబా పైకి వచ్చారు.

వారిని చూచి తడబడ్తూ సీతాపతిరాజు 'ఇదేమిటీ? మీరు యీ రాత్రి? ఏం జరిగింది? ఏమిటి విశేషం? అంటూ ప్రశ్నించాడు.

'ఏం లేదండి బావగారు, తమరికి బందిఖానా నుండి పిలుపు వచ్చింది. కొత్తపెళ్లికొడుకు ఎలా వెళుతాడో ఏమో? వార్తముందే చెపుదామని అమ్మాయికి అన్నగా నేను, స్నేహితుడిగా శ్రీ కలసి వచ్చాం' అంటూ లత వైపు తిరిగి 'లతా! నీకు మేం ఋణపడి వున్నాం, మేం కాదు పెళ్లీడున్న ఆడపిల్లలందరూ ఋణపడి వుంటారు. నీకు కృతజ్ఞతలు - ఆం బైదిబై ఈ రూం లాక్ తీసుకురా అంటూ చెప్పి సీతాపతిని రూంలో బంధించి ఆ రాత్రి వారక్కడే మరో గదిలో కబుర్లు చెప్పుకుంటూ వుండిపోయారు.

ఆ క్షణమే అందవలసిన వారి కందరికీ ఫోన్లు అందిపోయాయి.

న్యాయస్థానంలో సీతాపతి రాజుకు తగిన శిక్ష పడక తప్పలేదు.

కన్నీళ్లతో ప్రమీల ఫోటో ముందు అగరు వత్తులు వెలిగించాడు శ్రీనివాస బాబు.